# నెగిటివ్ గానే

దాసరాజు రామారావు

హృదయానికి
నాలుగువైపులా బార్లా తెరిచిన
తలపుల తలపులను
వెంటనే మూసెయ్
గది మూలల్లో
ఏ పులుగూ
పల్చటి, నునుపైన
రెక్కలెగరేసుకుంటూ
స్వరాగాల సవ్వడి
చెయ్యనీయొద్దు
సీలింగుకు వేలాడుతున్న ఫ్యాను
గిరగిరా తిరుగుతూ ,
దాన్ని చుట్టుకునే
సుడిగుండపు ఆలోచనల దుమారం
అంటిపెట్టుకుని వుంటే,
ఠక్కున స్విచ్ నొక్కేయ్
నిలువెత్తు పొగరుతో తల
ఎగరేయ వద్దని,
దర్జాగా, ఖరీదైన బీరాలు
పలకవద్దని
గాడ్రేజ్ బీరువా మూతికి ఎక్స్ మార్క్
టేబుల్ అతికించు
సేదదీరే డబుల్ కాట్‌తో పాటు
ఫక్కున నవ్విన పగటి కలల్ని,
చుక్కలు అలిగి మలిగి
చంద్రుని జాడ కానరాని,
అంత తొందరగా విరికాని
రాత్రి సమయాల్ని,
కాల్చి పారేసెయ్
గదంతా ఈదుతూ
అణువణువూ గాలించు
చీపురుపుల్ల దొరికినా
గండ్రగొడ్డలిగా మారుతుందేమో
ధూళి కణం కనిపించినా
అగ్గిరవ్వలా రాజుకుంటుందేమో
ఇస్త్రీ చేసి, మడత పెట్టిన
పట్టుబట్టల నుంచి
తలంబ్రాల వాసన వీస్తుందేమో
విరిగిన పెన్సిల్ ములుకులు,
అట్టలూడిన ప్రైమరీ వాచకాల పేజీలపై
అడ్డదిడ్డపు గీతలు,
నేను నేనంటూ
గుర్రం బొమ్మ గీయబోయి
గాడిదలా అయినందుకు
మూతి తిప్పుల్ల వెక్కిరింతలు.
తినుబండారాల అభాండాల సిగపట్లు,
బుంగమూతి మొహాల, అల్లరి చేష్టల
ఇల్లుపీకి పందిరేసిన పోలికలు
గదంతా వరించే వుంటయి

నాకు తెలియకుండా
నాకు కనిపించకుండా
మేనేజ్ చెయ్
అర్ధనేత్రాలు విప్పిన
నల్లతాచు రాత్రి పరదాల కదలికల మాటున
నాకు నేనే పూర్వపు పరిచయంలా
ఎదురు పడతానేమో
చిత్తు కాగితం ముక్క దొరికినా చూడు
అందులో అక్షరం రాసి వుంటదేమో
గాల్లో కలిసి
మబ్బుల ముషాయిరా తుఫానులు
సృష్టించొచ్చు
గదిని
నిర్మానుష్యం , నిరలంకారం, నిర్వీర్యం
నిర్దాక్షిణ్యంగా చెయ్
పాళీ పెట్టిన ఫుల్ స్టాప్ కూడా
గదిలో కనిపించొద్దు నాకు -
అంతా అయ్యాక
వెళ్తూ వెళ్తూ ఒక్కసారి
నా ముఖంలోకి
ఒక రెప్పపాటు నీ దయార్ద్ర చూపు బొట్టుని
ఒంపి వెళ్ళు
కత్తిగాట్లు పడ్డ నా ముఖం
ఎప్పుడన్న నీ కలలోకొచ్చి , నిన్ను
గుచ్చి గుచ్చి ప్రశ్నలడిగి
సతాయించక పోతుందా-
గది బయట
తాళం బాగా వేసావో లేదో
తడిమి తడిమి చూసుకో
మళ్ళా తాళం తీయడం పూర్తిగా మరచిపోవాలి సుమా
ఇప్పుడు గదా
గదిలో నాకిష్టమైన
ఏకంత సామ్రాజ్య వైభవోన్నతం
నాకు నేనే సర్వం సహా చక్రవర్తిని
నాకు నేనే సర్వం సహా బిక్షవర్తిని
ఇన్ని యోజనాల ప్రయాణంలో మనిషి తన పాదముద్రలో
ఎన్నడన్నా బంగారు కాసులు
ఏరుకున్నాడా-
ప్రజాస్వామ్యమా అలంకరించుకో
పంచవర్ణ ప్రణాళికల ఏడువారాల
నగల పెట్టెతో-
శరీరం నుండి గుండెని తవ్వి,
తీసుకుని
అద్దంలా నా ముందు ప్రతిష్ఠించుకుంటా -
మనసారా
తనువారా
కనులారా
అద్దంలో ఎన్నో ఎన్నో సార్లు
అలలెగిరిపడుతున్న అంతరంగాన్ని
వణుకుతున్న చేతుల్తో పట్టుకుని
లాలించడానికి ప్రయత్నిస్తున్నా
నిజానికి స్వంత మరణాన్ని ఇలా ఎదురుగా చూసుకుని మురిసిపోవడం
ఏ కాలమిచ్చిన జడ్జిమెంట్ -
ఆకాశం మేల్కొన్న తర్వాత
రేపటి పేపర్లో ,
నలుగురు మూగిన గుంపులో ,
తలో మాటా ముచ్చట్లలో
నా చావుని చూద్దురు గానీ-
అయినా
ఒక తెగని నమ్మకపు జీవధార....
ఏ రెండు నిండు కన్నీటి బొట్లు
వలవలా రాలిపడినా
ఒక అనితర సాధ్యపు
అసంపూర్తి గమనం
ఒక్క మెట్టు ఎక్కినట్టే- ***

## విలోమం పల్లపురము రాము

చిరునవ్వుల కెరటాలపై
జీవిత నావ సాగుతుంటే
కాలం పిడికిలి దెబ్బలకు
మనసు గాయమై
దుఃఖ ప్రవాహంలో
మునుగుతూ తేలుతూ
రక్త సిక్త మౌతుంటే
నూతన ఆశల సంకల్ప పరంపరలు సైతం
చీకటి మాయమౌతున్నాయి
ఎడారి కళ్ళలో
మొలకెత్తే కాంక్షల పచ్చ దనంపై
అనాలోచిత ఆలోచనా బిందువులు
ఎండమావులై వెక్కిరిస్తున్నాయి
అరువు తెచ్చుకున్న అంతరంగంలో
ఆశయాల హరివిల్లు ఉదయిస్తుందా ?
కలుపుమొక్కలు నిండిన హృదయంలో
ప్రేమవనం చిగురిస్తుందా ? ***



## ఎదగడమంటే బెల్లూరు సాంబమూర్తి

మన మూలాల్ని మన పాదాలతో
మనమే అణగ ద్రొక్కటం కాదు
మనతోపాటు అత్యున్నత శిఖరాలకు
తీసుకుపోవటం!
ఎదగటమంటే
మనల్ని నిలువెల్లా అల్లుకున్న తీగల్ని
పుటుక్కున తెంచేయటం కాదు
కమనీయస్పర్శను
వాటికి కానుక చేయటం!
ఎదగటమంటే
చండ్రనిప్పుల నెగజిమ్ముకుంటూ
నింగిలోనికెగిరిపోవటం కాదు
మమతానురాగాల జలాంతర్గాములై
జనసంద్రపు అట్టడుగుపొరల్లో
పయనించటం కూడా!
ఎదగటమంటే
మానవత్వాన్ని,మనిషితత్వాన్ని
విసర్జించటం కానేకాదు
అవే నీ అన్నపానీయాలవటం!
ఎదగటమంటే
అంతరిక్షంలోనో ఆవలి వైపునో
ఆవాసం కాదు
నీ ఇంటికీ ప్రక్కింటికీ
పెరిగిన దూరాన్ని తగ్గించటం!
ఎదగటమంటే
నీ అస్తిత్వాన్ని కోల్పోయి
రూపాయిగా రూపాంతరం
చెందటం అంతకన్నా కాదు
నీ జీవితపు దస్తావేజుకి
విలువెత్తు సంతకమవటం ***

## ఉగాది కోయిల ఉద్వేగం
## జొన్నలగడ్డ నారాయణ మూర్తి

**అంతరంగ విభేదాలు ఇన్నిన్నా అనుకుంటూ**
వస్తూన్న ఉగాది విస్తుపోయి చూస్తూన్నది
ఆమని కోయిల కూడా ఉద్వేగంలో ఉన్నది
అందరికీ నచ్చేలా పాడేదెలా అంటున్నది
మధు మాసారంభంలో
విధిగా పాడాల్సిన నాకు
పెదవి కదలకున్నదన్నది
వదిలి పెట్టేయండన్నది
వసంతకాలం రాగానే వనాంతరాలనుండి
దిశాంతాల దివ్యగానం వినిపించే కోయిలనేదో
అశాంతి అవహించినట్లున్నది
అసలు నేనెందుకు పాడాలంటున్నది
వగరై సగటు మనిషి జీవితముంటే
పగతో రావణకాష్టాలెన్నో రగులుతు ఉంటే
చిగుళ్ళెలా ముట్టగలనని
చిన్నబోయి చూస్తున్నట్లున్నది
తెలుగు తేజం బూజుపట్టి కళ తప్పిన వేళను
ఉప్పెనలా ఉద్రేకాలు ఉవ్వెత్తుగ లేస్తుంటే
తప్పులు లేకుండా తెలుగుపాట
ఇప్పుడెలా పాడమంటారని ప్రశ్నిస్తున్నది
మిగిలుంటుందా తెలుగని దిగులున్నది నాకన్నది
దిగి రండి దీక్షపూని రక్షించండన్నది
చెయ్యాలి ఈ తియ్యని భాషకు సేవలు మీరెన్నో
చెయ్యీ చెయ్యీ కలుపుతు రా రమ్మన్నది
తెలుగు తేనెవాకలు కాగా వెలుగుల్ని వెనకటిలా విరజిమ్మాలన్నది
కలకాలం నిలిచేలా పాటకు ప్రాణంలా తెలుగు మాటలు రాసేస్తేనే
పలుకును నా నోటనపుడు శృతీలయలు తప్పని
నిలబడి మిగిలిపోయే సిసలైన తెలుగు పాటన్నది

***

## అనామిక
## సత్య

**నీ చూపుల ప్రశ్నలకి నా మాటల జవాబు లేనపుడు**
నీ మాటల ప్రశ్నలకి నా ప్రవర్తన - సమాధానం కానపుడు
నీ నీడగ  సాగల్సిన సమయాన  నేనీడనే ఆగినపుడు
నీ మౌనాన్ని చీల్చి, నా మాటని పలికించలేనపుడు
నీ వొదిలిన నీట్టూర్పు శ్వాసల నిరాశని నేనాపలేనపుడు
నీ ఒంటరి అలోచనల తుంటరి వేగాన్ని నేనందుకోలేనపుడు
నీ గొంతు మింగిన గాలి గుటకల సహనాన్ని నేనోర్వలేనపుడు
నీ సిగ్గూబిడియాల సిరి సంపదని నేనర్థం చేసుకోలేనపుడు
నీ మోమున మొగమాటానికి నామొండితనం ఆడ్డై నపుడు
నీ చేతిలో చేయేసి నా ఊసులని బాసలుగా  మలచలేనపుడు

తరాలు దాటినా, అదే పాతప్రశ్న మళ్ళీ నాముందుకు వస్తుంది
నిన్నర్థం చేసేసుకున్నానన్న నా గగనగర్వాన్ని నేలకు తెస్తుంది.
నా ప్రశ్న నిజమేనా? నివ్వింకా నాకు అజ్ఞాతవేనా?

***



# దిక్కుమాలిన దిశకెందుకు?

డా.నారాయణ గరిమెళ్ళ

ఒక పక్క,
ఎవరెస్టు శిఖరాన్ని
అధిరోహించిన మరో భారత నారీ రత్నం
మా మనోఫలకాలమీద
విజయగర్వంతో ఉప్పొంగిపోతోంది.

మరో వంక,
ఐయేఎస్ లో అగ్రభాగాన
నిలిచిన దివ్య కూడా
ఆడోళ్ళంటే ఎవరికి వారే తట్టుకుని
ఎదుగుతోన్న భుజాలు అని సందేశమిస్తోంది

పోటా పోటీలుగా
అవని నుంచి
అంతరిక్షం వరకూ
అడుగులు అడుగులై
అవధరిస్తోన్న
అమ్మల రూపాలన్నీకూడా
కొత్త శకాల్ని నమోదు చేస్తున్నాయని,
దూసుకుపోతున్నాయని
తీర్మానించేసుకుంటున్నప్పుడు

ఇదేమిటిలా..?
ఆడపిల్లని కనబోతోందని తెలిసి
ఆలి మీద అదొక నేరంలా మోపి
మరీ అంతం చేసేశావు.!

అమ్మనేది ఉన్నందుకే
కదా అందరమూ ఉన్నది

నీ ప్రకారమే
జనన ఫలితాలని
శాసించేది అమ్మ మాత్రమే ఐతే
నిన్ను మగాడిగా కన్నందుకు
ఇప్పుడు
నీ తల్లి నిన్ను హత్య చెయ్యాలా,
లేక ఆత్మ-హత్య చేసుకోవాలా?

మరో సారి
మధ్య యుగాల కిందకు
తీసుకు పోతావేమోనని
పాలు తాగుతున్న
పసిపాపలు సైతం
తుళ్ళి తుళ్ళి పడుతున్నారు

నడపడం నడవడం
చేతకాకపోతే
ఆగిపో కానీ
అడ్డుతగలబోకు

హారతులందుకునే వేళ
అతివల కళ్ళల్లో మంటలకు
ఆహుతి కావాలనుకోకు ***

# రసరేఖలు శ్రీధర్ బచ్చోటి

ఎక్కడున్నను గాని వినిపించు పాట
హృదయ తంత్రులు మీటి రంజించు పాట
ప్రేమ తలపుల వెలిదీయు పికము పాట
ఎదను నింగిని తేల్చు తుమ్మెదల పాట

ఎవ్వరోనెక్కడో వినిపించు పాట
గుండె తలుపులు తట్టి లోగొనెడు పాట
చెంత చేరిన రాగాల చెలియ పాట
నెచ్చెలికి దూరమైన కన్నీటి పాట

రాలు ప్రతియాకులోనొక్క బ్రతుకు పాట
రగులు ప్రతిగుండెలోనొక్క వగపు పాట
చిలిపి చిన్నారి యెదలోని వలపు పాట
కలల కలిగిన తీయని తలపు పాట

సరళముగ సాగు చిరుగాలి తరగ పాట
ఘనగుహాంతరమందు ఝుమ్మనెడు పాట
అలుపెరుంగని సంద్రపుటలల పాట
విశ్వమెల్లను పాడు నా ప్రేమ పాట

ఇలను కాలిడు క్షణము గొంతెత్తు పాట
బ్రతుకు దారిలో వెన్నంటి వచ్చు పాట
దారి చివరననెచటికో తరలు పాట
తరలి పోయిననిచ్చటే తనరు పాట ***

POST YOUR COMMENTS